

ఏబీసీ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) ప్రారంభించనున్నట్లు కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ చెప్పారు. నగరంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాల నిర్వహణ కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ వెహికల్ షెడ్ ఆవరణంలో ప్రత్యేక ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ చేయడానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. గురువారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్.అముద ఈ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఏబీసీ కేంద్రంలో ఏర్పాట్లను బుధవారం కమిషనర్ ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ పర్యవేక్షించారు.



పకడ్బందీగా పబ్లిక్ పరీక్షల నిర్వహణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మార్చి 1 నుండి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ థీయరీ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు, మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయపు సమావేశపు మందిరంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ థీయరీ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ థీయరీ పరీక్షలకు సంబంధించి మార్చి 1 నుండి 20వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. మొత్తం 30,652 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఇందులో మొదటి సంవత్సరానికి సంబందించి 15,482 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబందించి 15,170 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకు గానూ జిల్లా వ్యాప్తంగా 50 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 118 కేంద్రాలలో రెగ్యులర్ విద్యార్థులు 20,954 మంది, ప్రైవేట్ విద్యార్థులు 294 మంది కాగా మొత్తం 21,248 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు చీటింగ్‌కు పాల్పడిన ఎక్సామినేషన్ యాక్ట్ కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లాలో స్ట్రాంగ్ రూముల వద్ద, పరీక్షల కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, ఒఆర్ఎస్ఎస్ ప్యాకెట్లు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల్లో భాగంగా తగినంత లైటింగ్, మంచినీరు అందించడం, నీటి వసతితో కూడిన మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. పరీక్షల కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చేయాలన్నారు. దూర ప్రాంత విద్యార్థులు పరీక్షలకు సకాలంలో చేరుకొనేలా బస్సులు నడిపేలా ఆర్‌టిసి అధికారులు చర్యలు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, పారిశుద్ధ్య పనులను మెరుగ్గా చేపట్టాలని, ప్రశ్నాపత్రాలు, జవాబుపత్రాల తరలింపుకు సంబంధించి పటిష్ట బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డిఆర్‌ఓ మోహన్ కుమార్, ఇంటర్మీడియట్ డిఐఒ సయ్యద్ మౌలా, డీఈవో వరలక్ష్మి, డీఎం అండ్ హెచ్‌వో సుధారాణి, అధికారులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నీటి కాలువ ఆక్రమణలు తొలగింపు

- సిపిఎం పోరాటంతో స్పందించిన తహశీల్దార్
- రైతులపై దౌర్జన్యం జరగకుండా పోలీసుల పహారా
- జెసిబితో పూడిక తీయించిన తహశీల్దార్



ఆక్రమణకు గురైన కాలువను పరిశీలిస్తున్న తహశీల్దార్, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీలోని ఆరు గ్రామాలకు సంబంధించిన రైతులకు సాగునీరు అందించే కాలువనీరు పారకుండా గత 15 సంవత్సరాలుగా ఆక్రమించుకుని పూడ్చి వేయడం జరిగిందని, సిపిఎం ఆధ్వర్యంలో పలు దపాలు ఆందోళన చేయగా బుధవారం రెవెన్యూ అధికారులు స్పందించి కాలువ పూడికతీత చేశారని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా గంగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరన్, జిల్లా నాయకులు ఓబుల్ రాజు, మండల కార్యదర్శి బంగారు మురళి అధికారులతో కలిసి బుధవారం కాలువ పూడికతీతలు తీయించారు. వారు మాట్లాడుతూ తహశీల్దార్ రైతులకు న్యాయం చేయాలని ఎటువంటి ఘటనలకు తావులేకుండా పోలీసుల సహకారంతో ఆక్రమణకు గురైన కాలువ పూడికతీత చేయించడం శుభపరిణామని అన్నారు. రైతులకు ఈ సమస్యపై పలు దఫాలు పోరాటాలు చేసి అలసిపోయారని, ఇక తమ వల్లకాదని వదిలేశారని అయితే సాగునీటి సమస్య గురించి తెలుసుకున్న సిపిఎం రైతులకు అండగా నిలిచి జిల్లా కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు అన్ని రకాలుగా ప్రయత్నం చేయడంతో నేడు అధికారులు రైతుల సమస్యను పరిష్కరించాలరని తెలిపారు. అయినప్పటికీ కొందరు ఆక్రమణదారులు కాలువ పూడికతీతను అడ్డుకునే ప్రయత్నం చేశారని, అధికారులు అవేమీ లెక్క చేయకుండా పనికొనసాగించడం మంచి పరిణామని అన్నారు. రైతులందరూ ఐక్యంగా ఉండి భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు రాకుండా కలిసి పోరాడాలని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కాలువ ఇరువైపుల ఆక్రమణకు గురైందని, ఉన్న కాలువలో నీరు ప్రవహించేలా అందరూ సహకరించాలని కోరారు. సాగునీటి కాలువలో నీరు ప్రవహిస్తే ఇరువైపులా పొలాలకు నీరు అందడంతోపాటు బోర్లు, భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో ఎవరు ఆక్రమణలకు పూనుకోకుండా అందరికీ ఉపయోగపడే పద్ధతిలో కాలువను వినియోగించుకోవాలని సూచించారు. కాలవ ఆక్రమణకు గురికాకుండా రెవెన్యూ అధికారులు అక్కడక్కడ సూచిక బోర్లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కోరారు.

పారిశుద్ధ్యం లోపిస్తే కఠిన చర్యలు

డిపిఓ సుధాకర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఓ సుధాకర రావు

ప్రజాశక్తి- వీ కోట: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత సచివాలయ సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని చిత్తూరు డిపిఓ సుధాకర్ రావు హెచ్చరించారు. మండల కేంద్రమైన వీ కోటలోని చెత్త నుంచి సంపద కేంద్రం ప్రాంగణంలో బుధవారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా డిపిఓ మాట్లాడుతూ పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు మేరకు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత పంచాయతీ సిబ్బందిపై కఠినచర్యలు చేపడతామని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామాల్లో పారిశుద్ధ్యం ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతను పరిరక్షించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమంపై ప్రజలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందని అన్నారు. అనంతరం వీ కోట గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో డిపీఓ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది కార్యదర్శులు పారిశుధ్య పనులను చేపట్టారు. త్వరలో స్వయం సహాయక సంఘాల సభ్యులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తామని తెలియజేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలి వద్ద మానవహారాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ పిఎన్ లక్ష్మి, ఎంపీడీవో ఈశ్వరన్న, ఈవో శంకరయ్య, అధికారులు, ఈవోపీఆర్డీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ బుధవారం కట్టమంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కై హోమ్ మల్టీ బ్రాండెడ్ ఫర్నిచర్ షోరూమ్‌ను ప్రారంభించారు. మదనపల్లిలో గత 20 ఏళ్లుగా నాణ్యమైన ఫర్నిచర్స్ విక్రయాల్లో అనుభవమున్న స్కై హోమ్ సంస్థ చిత్తూరులోనూ షోరూమ్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు, షోరూం నిర్వాహకులు పాల్గొన్నారు.



ఫర్నిచర్ షాప్‌ను ప్రారంభిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

ప్రజాప్రతినిధులు అంటే అలుసా...

- గోకులం షెడ్స్ మంజూరులో వివక్ష ఎందుకు..
- మండల సమావేశంలో సభ్యులు ధ్వజం...



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ పార్థసారథి

ప్రజాశక్తి- యాదమరి

ప్రజాప్రతినిధులు అంటే లెక్క లేదా.. అంత అలుసా అంటూ మండల పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు, సర్పంచులు నిలదీశారు. ఇటీవల ఉపాధి హామీలో మంజూరైన గోకులం షెడ్లు సంబంధించి సర్పంచులు ప్రజాప్రతినిధులకు ఎవరికి ఎటువంటి సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఉపాధి అధికారులను ప్రశ్నించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. గోకులం షెడ్లు మంజూరులో మొర్దన్‌పల్లి గ్రామపంచాయతీకి ఒకే ఒక్క గోకులం షెడ్ల మంజూరు చేశారని మిగిలిన అన్ని గ్రామపంచాయతీలకు ఐదు షెడ్డు లెక్కన మంజూరు చేశారని, ఉపాధి హామీ అధికారులు ఎందుకు వివక్ష చూపిస్తున్నారని అధికారులను నిలదీశారు. పంచాయతీలో ఎక్కువ శాతం పాడి రైతులు ఉన్నారని అర్హులైన వారికి గోకులం షెడ్లు మంజూరు చేయాలన్నారు. మండలంలో యూరియా కొరత ఉందని రైతులకు సకాలంలో యూరియా అందించాలని వ్యవసాయ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. మండల అభివృద్ధి అధికారి వేణు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామసమస్యల పరిష్కారానికి చొరవ తీసుకొని పంచాయతీని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సిమెంట్ రోడ్లకు అనుమతి ఇవ్వలేదని ప్రభుత్వం, తాగునీరు, పారిశుద్ధ్యం పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని సర్పంచులకు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి సరిత మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు ఆర్‌బికెలో ఈనెల 28 లోపు రైతు కార్డు కోసం ఎన్రోల్మెంట్ చేసుకొని కార్డు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ఈఈ గుర్రప్ప మాట్లాడుతూ మండలంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కరించేందుకు ఆర్డీఎస్ ద్వారా ప్రతి గ్రామానికి కొత్తగా లైన్లో వేస్తున్నామని తెలిపారు. వైస్ ఎంపీపీ ఆర్.నారాయణ రెడ్డి మాట్లాడుతూ సర్వేనెంబర్ 135లో ఫారెస్ట్ రెవెన్యూ సంబంధించిన భూములు హద్దులను సర్వేచేసి గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు. సెరికల్చర్ ద్వారా రైతులకు పట్టుపురుగుల పెంపకం చేసుకునేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ అందిస్తుందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పిఓపిఆర్‌డి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు తాగునీటి సమస్య ఉన్న గ్రామాలలో దృష్టిసారించి తాగునీటి సమస్య పరిష్కరించే విధంగాచర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. విద్యాశాఖ అధికారులు రుక్మిణి, ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీవో రద్దు చేసిందని, మండలంలో 32 పాఠశాలలు ఒకే టీచర్‌తో నడుస్తుందన్నారు. మండల పరిధిలో 71 పాఠశాలలు ఉన్నాయని అందులో 3391 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని తెలిపారు. మండల సమావేశానికి రోడ్ల భవనాల శాఖ, రోడ్డు రవాణా, హార్టికల్చర్ శాఖల అధికారులు హాజరుకాలేదు. వైస్ ఎంపీపీలు హరినారాయణ రెడ్డి, రవీంద్ర తహశీల్దార్ పార్థసారథి, ఇరిగేషన్ ఏఈ, కిషోర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఉషారాణి, విద్యాశాఖ అధికారులు రుక్మిణి, ప్రసాద్, ఏపీఎం ఈశ్వరి, యుఆర్‌డి సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రచ్చరచ్చగా సర్వసభ్య సమావేశం

పంచాయతీ తీర్మానం లేకుండానే సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి- విజయపురం

మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం రచ్చరచ్చగా జరిగింది. పంచాయతీ తీర్మాణం లేకుండా పనులు ఎలా చేస్తారంటూ పన్నూరు దళితవాడ సర్పంచ్ కుమార్ పంచాయతీ రాజ్ ఏఈని నిలదీశారు. గ్రామంలో అభివృద్ధి పనులను సర్పంచ్ ఆమోదం లేకుండానే ఎలా చేస్తారని మండిపడ్డారు. సర్పంచులు తెలియజేసి అభివృద్ధి చేయాలని లేదంటే కోర్టును ఆశ్రయించాలని కోరారు. మండలంలో గోకులం షెడ్లకు మొత్తం 80 మంది అర్జీలు ఇవ్వగా అందులో 51 మంజూరు అయ్యాయని, అది కూడా అధికార పార్టీ నాయకులకే ఇచ్చారని వాపోతున్నారు. విజయపురం దళితవాడలో నెల రోజులుగా ఉపాధి పనులు నిర్వహించడం లేదని, పంచాయతీ తీర్మాణం లేకుండా క్షేత్ర సహాయకులను మార్చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు టీడీపీకి ఏకపక్షంగా పనులు చేస్తున్నారని బూచివానత్తం ఎంపీటీసీ రాజగోపాల్ ఆరోపించారు. ఆర్డబ్ల్యూఎస్ స్కీం ఇళ్లత్తూరు నుండి వస్తూ ఉండేదని, ఇప్పుడు రావడం లేదు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కోసల్ నగర్ ఎంపీటీసీ మునియమ్మ అధికారులను సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై సమీక్షించారు. వైస్‌ఎంపీపీ బాలాజీ, జడ్పీటీసీ రేవతి, తహసీ ల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, ఏవో రజినీకుమారీ, పీఆర్‌ఎఈఈ వీరబద్రం పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సమీక్షిస్తున్న అధికారులు

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో పాడి రైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ కార్యక్రమం పశు వైద్య సహాయ సంచాలకులు ఆసిఫ్ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకుంటామని పాడి అభివృద్ధి చెందేందుకు రైతులు అవసరమైన యంత్రాలను 40 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆ యంత్రం విలువ రూ.33,970లు అయినప్పటికీ పాడి రైతు చెల్లించేది రూ.20,382లు మాత్రమే అని సబ్సిడీ రూ.13,588లతో రైతులకు అందిస్తున్నామన్నారు. మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, ధరణి, జనార్ధన్ గౌడ్, విక్రమ్, లోకనాథం నాయుడు, నేతాజీ నాయుడు పాల్గొన్నారు.



పాడి రైతులకు యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు



ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ ప్రథమ సెమిస్టర్ విద్యార్థులు తమ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల పరిధిలో అటానమస్ హోదాలో జనవరి నెలలో బీటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పరీక్షా ఫలితాలను బీసీఎన్ విద్యాసంస్థల ఛైర్మన్, జవహర్ లాల్ నెహ్రు సాంకేతిక విశ్వవిద్యాలయ పరీక్షా పరిశీలకులు ప్రొఫెసర్ డాక్టర్ చిత్ర, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, హ్యూమానిటీస్ అండ్ సైన్సస్ విభాగాధిపతి జె.మాధవన్, కళాశాల కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ సోమసుందరం కలసి బుధవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తమ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సుమిత్ర 93.6శాతం మార్కులతో ప్రథమ స్థానం, జాహ్నవి పద్మప్రియ 93.5శాతం మార్కులతో ద్వితీయ స్థానం, మనోజ్ కుమార్ 92.5 శాతం తృతీయ స్థానం సాధించారని తెలిపారు. అత్యధిక శాతం విద్యార్థులు డిస్టెంక్షన్, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఈ విజయానికి కారకులైన కళాశాల అధ్యాపకులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని సర్వే ద్వారా

2 లోపు గుర్తించండి: కలెక్టర్



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిని మార్చి 2వ తేదీ లోపు గుర్తించి పి4 విధానం ద్వారా వారి ఆర్థిక సాధికారతకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో పి4 విధానం (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్ షిప్) ద్వారా పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడానికి జీవన ప్రమాణాలలో అట్టడుగు స్థాయిలో గల 20శాతం మంది నిరుపేదలను గుర్తించడానికి నిర్వహించనున్న సర్వేపై జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్న వారి సహకారంతో అట్టడగు స్థాయిలో ఉంటూ జీవించడానికి కనీస సౌకర్యాలు లేనివారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి పి4 విధానాన్ని అవలంభిస్తున్నదని అన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ప్రమాణాలను అనుసరించి ఫిబ్రవరి 20 నుంచి మార్చి 02 వరకు సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్లులు, ఎంపిడిఓలను ఆదేశించారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించడంలో భాగంగా పక్కాగృహం, విద్యుత్ సౌకర్యం, ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్, స్థిర, చర ఆస్తులు లేని వారిని గుర్తించి అర్హులుగా చేర్చాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాలలో గతంలో నిర్వహించిన ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన సమాచారంను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు సిపిఓ సాంబశివా రెడ్డి, డిఎల్‌డిఓ రవికుమార్ అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ప్రధాన ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, డిసిహెచ్ఎస్ మెడికల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ వైద్యసేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా సకాలంలో వైద్యసేవలు అందించడంలో ఆరోగ్య మిత్రులు వెంటనే స్పందించి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పేషంట్ వార్డులను పరిశీలించి వారు పొందే సేవలలో ఎటువంటి సమస్యలు ఉన్న సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి వైద్యసేవలు అందించేలా పనిచేయాలన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగుల నుంచి ఎటువంటి రుసుం పొందినట్లు ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, అపోలో ఇంచార్జ్ నరేష్ కుమార్‌రెడ్డి, అధికారులు, ఆరోగ్య మిత్రులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

'మా పిల్లలను బడికి పంపలేం'

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: తమ పిల్లలను బడికి పంపలేమంటూ మండల పరిధిలోని కట్టకిందపల్లి హరిజనవాడ ప్రజలు చెబుతున్నారు. ఈసందర్భంగా బుధవారం ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో ఆంజనేయుల శెట్టికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఎస్ఎంసి ఛైర్మన్ బాబు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి వేపంజెరి గ్రామంకు మూడు కిలోమీటర్లపై దూరం ఉందన్నారు. గతంలో కట్టకిందపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను వేపంజెరిలో మర్జింగ్ చేయడం వలన ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 20 మంది పిల్లలు మూడు కిలోమీటర్లు వెళ్లి మళ్లీ తిరిగి రావడం కష్టంగా ఉందన్నారు. కనుక గతంలో ఇక్కడున్న పాఠశాలలోనే పిల్లలకు విద్యాబోధన చేయాలని కోరారు. ప్రభుత్వం తమ గ్రామంలోని పాఠశాలను నిర్వహించాలని, వేరే పాఠశాలలో కలపకూడదని కోరారు.

ఆసర్ -2024 సర్వే రిపోర్ట్ విడుదల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గత పది సంవత్సరాలుగా దేశంలో ఉన్నటువంటి గ్రామీణ ప్రాంతాలలో ఆసర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అపోలో విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ వాలంటరీలతో చిత్తూరు జిల్లాలోని 30 గ్రామాలు ఎంపిక చేసి సర్వే నిర్వహించారు. సుమారుగా 60మంది వాలంటరీలు ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో సర్వే నిర్వహించారు. సర్వే రిపోర్టును అపోలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ హచ్ వినోద్ బట్, ఆసర్ ప్రతినిధి సభామూర్తి, మేనేజర్ సురేష్ కుమార్, సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ సమన్వయకర్త డాక్టర్ మహేందర్ నాథ్ ఆవిష్కరించారు. అనంతరం వాలంటరీలకు సర్టిఫికెట్స్, జ్ఞాపికను అందజేయడం జరిగింది. ఇటువంటి కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో విద్యావ్యవస్థలో ఉన్నటువంటి స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ఈ సర్వే వారికో మంచి అవకాశమని ఎన్ఎస్ఎస్ వాలంటరీలు తెలిపారు.

ప్రజలకు శాశ్వతంగా దూరమవుతారు: టిడిపి

ప్రజాశక్తి- పుంగనూరు: రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ప్రజలతో ఇప్పటికే దూరమయ్యారని పార్టీ అహంకారంతో మాట్లాడుతూ ఇంకా మార్పు రాకపోతే శాశ్వతంగా ప్రజలకు దూరమవుతారని సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మధుసూదన్ రాయల్, పెద్ద మోహన్ నాయుడు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వల్లభనేని వంశీతో ములక్కాత్ జరిగిన తరువాత మీడియాతో మాట్లాడిన మాటలు వారి అహంకారానికి నిదర్శనమన్నారు. సప్త సముద్రాల వెనుకున్న, రిటైర్ అయిన ఉద్యోగస్తుల బట్టలు ఊడదీస్తామనడం, ఎంతటి వారైనా వారిని వదిలిపెట్టమని బెదిరించడం వింటే ప్రజాక్షేత్రంలో మీరు ఎప్పటికీ నిలవలేరని అర్థమవుతుందన్నారు. గతంలో ఐఏఎస్, ఐపిఎస్‌లను హైకోర్టులో నిలబెట్టిన ఘనత వైఎస్ఆర్‌సీపీకే దక్కుతుందన్నారు. ప్రజాసమస్యల పైన మాట్లాడాలంటే ప్రజలు మీకు ఇచ్చిన 11 సీట్లతో అసెంబ్లీలోకి వెళ్లి మాట్లాడండి.. అక్కడ మీ గళాన్ని వినిపించండి అని అన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పెద్దఉప్పరపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న 52మంది విద్యార్థులకు పెద్దఉప్పరపల్లి వైద్యాధికారి బాలాజీ ఆధ్వర్యంలో కంటి అద్దాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నెలరోజుల క్రితం విద్యార్థులు అందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి కంటి చూపు తక్కువగా ఉన్న వారికి అద్దాలు అవసరమని గుర్తించి ఎంపిక చేశామని 52మంది విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థులు తక్కువ వెలుతురులో చదవడం చేయకూడదని, మొబైల్ ఫోన్ చూడడం తగ్గించాలని, ఆకుకూరలు, గుడ్లు, పండ్లు ఆహారంలో తప్పకుండా స్వీకరించాలని దీనిద్వారా కంటిచూపులో మెరుగుదల ఉంటుందని అన్నారు. ఏఎన్ఎం హేమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాభ్యాసం చేపట్టాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఉపాధ్యాయులు తమ తరగతి బోధనాంసన ప్రక్రియలో గుర్తించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రణాళిక వేసుకుని, అమలు చేసి వివరాలను రికార్డు చేయడమే యాక్షన్ రీసెర్చ్ అని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ అన్నారు. బుధవారం డైట్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభ పద్దతిలో అర్థమయ్యే విధంగా విద్యాభ్యాసాలు చేపట్టడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. గూగుల్ ఫామ్ ద్వారా నమోదు చేసుకుని ఎంపిక చేసిన ఉపాధ్యాయులు డైట్లో నిర్వహించే యాక్షన్ రీసెర్చ్‌కు అనుగుణంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి ఆ అంశాన్ని విద్యార్థులకు బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ప్రభాకర్, చెంగల్‌రాజు, సునీత, నిర్మల, దేవప్రసాద్ రఫీ, అనిత, నాగరాజు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీరు వృథా కాకుండా మరమ్మతులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పార్వతీ నగర్‌కు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ లీకేజీ అవుతూ ఉండడంతో బుధవారం పంచాయతీ కార్యదర్శి మేనక ఆధ్వర్యంలో జెసిబి ద్వారా పైప్‌లైన్ ఉన్న ప్రాంతాలను మట్టిలోడి లీకేజీ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి మరమ్మతులు చేయించారు. రానున్న వేసవికాలం దృష్ట్యా తాగునీరు వృథా కాకుండా ప్రజలకు సద్వినియోగం అయ్యేవిధంగా చూస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఎక్కడెక్కడ తాగునీరు లీకేజీ ఉందో అక్కడ పైపులైన్లు మరమ్మతులు చేసి లీకేజీలు కాకుండా చూస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా తాగునీటిని వృథా కాకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నియోజకవర్గ వాల్మీకి సంఘం

అధ్యక్షులుగా శివశేఖర్

ప్రజాశక్తి- చౌడేపల్లి: పుంగనూరు నియోజకవర్గ వాల్మీకి సంఘ అధ్యక్షులుగా చౌడేపల్లి మండలం పుదీపట్ల పంచాయతీ తిరుమనిపల్లికి చెందిన తలారి శివశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు వాల్మీకి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు నియామక పత్రాన్ని అందించినట్లు శివశేఖర్ తెలిపారు. వాల్మీకి సంఘం బలోపేతానికి వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణకి కృషి చేస్తానని తెలిపారు.

మైనార్టీ సోదరులకు అండగా ఉంటాం..


చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలో మైనారిటీ సోదరులకు అండగా ఉంటానని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఎంబీపీ రోడ్డులోని షాదీ మహల్లో అంజుమన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంతోమంది మైనారిటీ సోదరులపైన అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించిన దాఖలాలు ఉన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు ఎటువంటి పథకాలు లేకుండా చేసిందని, చివరికి దుల్హన్ పథకం, రంజాన్ తోఫా వంటి పథకాలను తొలగించిందన్నారు. పట్టణం చుట్టుపక్కలున్న మైనార్టీ సోదరుల ఆస్తులను ఎవరైనా దౌర్జన్యంగా ఆక్రమిస్తే తక్షణమే తాను అక్కడికి చేరుకుని బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సయ్యద్ సుహేల్ బాష, సద్దాం బాష, మాజీ కౌన్సిలర్ ఇబ్రహీం, షమీర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు

- డిపిఓ సుధాకర్ రావు

ప్రజాశక్తి- వీకోట



జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా డిపిఓ సుధాకర్ రావు తెలిపారు. జిల్లా డిపిఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల్లో ప్రజలకు మెరుగైనపాలన అందించేందుకు వివిధ చర్యలు చేపట్టినట్లు ప్రజాశక్తి ప్రతినిధితో వారు తెలిపారు.

- జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టే విధంగా సంబంధిత కార్యదర్శులకు పలు సూచనలు అందించడం జరిగిందని, అవసరమైన ప్రాంతాల్లో చేతి బోరు పంపులను మరమ్మతులు చేయించడంతోపాటు నీటి సమస్యను పరిష్కరించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులను ఈ పనులకు వెచ్చించనున్నట్లు వారు తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి బోర్లు ఎండిపోయిన చోట నూతన బోర్లు వేయిస్తామన్నారు. తాగునీరు అందించేందుకు నిధులు కొరత లేదని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కఠినచర్యలు చేపట్టామన్నారు. 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయడం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించగలుగుతున్నామని తెలిపారు.
- గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీ పరిధిలో కార్యదర్శులు, సిబ్బంది పరిశుభ్రత, ప్రజాఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచే విధంగా పారిశుద్ధ్య పనులు చేపట్టి పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పరిశుభ్రమైన రాష్ట్రంగా పరిరక్షించే లక్ష్యంతో చిత్తూరు జిల్లాలో పారిశుద్ధ్య పనులను మెరుగుకు సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజాప్రతినిధుల సహకారంతో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.
- ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ కావడంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. లక్ష్యాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీలలో నిధులు కొరత లేనందున పారదర్శకంగా పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ ప్రజాప్రతినిధుల సహకారంతో మరింత వేగవంతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుకెళ్తున్నామని తెలిపారు.
- జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో ఇప్పటివరకు 50 శాతం పన్నులు పూర్తిగా వసూలు చేస్తామని, మార్చి 15నాటికి 100శాతం పన్నులు వసూలు చేసేందుకు కార్యాచరణ ప్రకటించినట్లు తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువులను విక్రయించడంతోపాటు వాటి ద్వారా తయారు కేంద్రాల వద్ద కూరగాయలు పండించి అంగన్వాడీలకు, పాఠశాలలకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 40శాతం మేర ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రణాళికలతో ముందుకెళుతున్నామన్నారు.
- గ్రామపంచాయతీల మనుగడలో కార్మికులదే కీలక భాగస్వామ్యమని, వారి సంక్షేమానికి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వాటిని సక్రమంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు.

పారిశుధ్యానికి పెద్దపీట

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాస రావు పట్టణంలో పారిశుధ్యానికి పెద్దపీట వేశారు. ఆయప కుప్పం కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పట్టణంలో పారిశుధ్య పనులతో పాటు సుందరీకరణ పనులు సైతం వేగం పుంజుకున్నాయి. ఇప్పటికే పట్టణంలోని పలు కూడళ్ల వద్ద, ప్రధాన రహదారికి మధ్యలో పచ్చని చెట్లు పెంచడం, ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం వంటి పనులను చేపట్టారు. అలాగే కొన్ని సంవత్సరాలుగా పూడిపోయి, నిరుపయోగంగా మారిన కాలువలను పూడిక తీసి, ఆధునీకరించి ఉపయోగంలోనికి తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నార్త్ ప్యాలెస్ రోడ్డు, ఆర్‌విఎం వీధి ప్రాంతాలలో కాలువల పూడికతీత పనులను నిర్వహించారు. ఈ పనులను పురపాలక సంఘం కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఉన్న ప్రతి కాలువలోను పూడిక తీత పనులు నిర్వహిస్తామని, మరో 10రోజులలో ఈ పనులు పూర్తి చేసి పట్టణంలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండంలోని దిగువ తడకర గ్రామసమీపంలో మామిడి తోపులో ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమచారం రావడంతో దాడి చేసి వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4600లు, ఓ ఆటోను స్వాధీం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలియజేశారు.

పురపాలక సిబ్బందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ సహకారంతో బిఆర్‌డి ఆసుపత్రి, శాంతి డెంటల్ క్లినిక్ వారు పురపాలక సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము పాల్గొన్నారు. ఈ శిబిరంలో భాగంగా పురపాలక సిబ్బందికి సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స చేయడం జరిగింది. బిఆర్‌డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సురేష్ బాబు, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్, సభ్యులు సెల్వం, సెంథిల్ పాల్గొన్నారు.


నిధులు విడుదలపై హర్షం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం ద్వారా ముస్లిం, మైనార్టీలకు రూ.45 కోట్లు నిధులు విడుదల చేయడంపై నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామంలో బుధవారం పలువురు ముస్లింలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నియాజ్ అలీ మాట్లాడుతూ మసీదులో పనిచేసే ఇమామ్, మౌజన్లకు గత ఆరు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు, అలాగే మసీదులో మెయిన్‌టెనెన్స్ నిధులు కలిపి రూ.45 కోట్లు మంజూరు చేయడం పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టిడిపి మండల ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి అతేహర్ అలీ, ముర్తుజా, అలీ అబ్బాస్, ఫెరోజ్ అలీ, జోహార్, మెహిది, మహమ్మద్, ఇంతూ పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా

మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి- వెదురుకుప్పం:



మండలంలోని తిరుమలయ్యపల్లి గ్రామపంచాయతీలో స్వర్ణ ఆంధ్రలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణకు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తిరుమలయ్యపల్లి గ్రామ పంచాయతీ ప్రధాన రహదారికి, అంతర్గత రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలు, పొదలు, చెత్త కుప్పలు, పేడదిబ్బలను తొలగించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.అమర్నాథ్ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి విస్తరణ అధికారి ఎల్.పురుషోత్తం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ మరకాల కుప్పం భారతి రాముపాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి- సోమల: పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాతృభాషతోపాటు హిందీ భాషపై కూడా పట్టుసాధించి రాయడం, చదవడం, మాట్లాడడం నేర్చుకోవాలని నంజంపేట జెడ్‌పి ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ కోరారు. హిందీ భాష ఉత్సవాలలో భాగంగా పాఠశాలలో బుధవారం విద్యార్థులకు హిందీభాషలో వ్యాసరచన పోటీలు పద్య పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. హిందీ ఉపాధ్యాయురాలు మాలతి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన

ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన
మూడు నెలలుగా పట్టించుకోని అధికారులు



ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామంలోని టిడిపి కళ్యాణ మండపం సమీపంలో సుమారు 15 కుటుంబాలు నివాసముంటున్నాయి. గత మూడు నెలలుగా వీరు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో బుధవారం ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గత మూడు నెలలుగా తాగునీరు అందడం లేదని, నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి చాలా కష్టపడుతున్నామని వాపోయారు. అధికారులను అడుగుతుంటే పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని దీంతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా రెండుమూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపిడిఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వారు అర్జీ అందేశారు. ఎంపీడీవో స్పందించి రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, తాగునీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది బాధ్యతాయుతంగా వారి విధులను నిర్వర్తించాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిచన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్యఆరోగ్యశాఖ అధికారులను హెచ్చరించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, బంగారుపాల్యం సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, పిహెచ్‌సిల మెడికల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నదని ఇందుకు అనుగుణంగా వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది వారి పనితీరు బాధ్యతాయుతంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని పిహెచ్‌సిలలో 24×7గా వున్న పిహెచ్‌సిలలో రాత్రి వేళల్లో ఆరోగ్య సిబ్బంది ఉన్నది లేనిది జిల్లా యంత్రాంగం క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతున్నదన్నారు. రాత్రి వేళల్లో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిఎం అండ్ హెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు, వైద్యసిబ్బంది ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వేస్తున్నది, లేనిది పరిశీలిస్తున్నారా లేదా అని, ప్రతి పిహెచ్‌సిలో ఓపి సంఖ్య ఎంత, ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, సమయ పాలన, వారు అందించే సేవలు సంబంధిత అంశాలపై పిహెచ్‌సిల వారీగా మెడికల్ ఆఫీసర్లతో సమీక్షించడం జరుగుతుందని ఇందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌సిడి సర్వే కొన్ని పిహెచ్‌సిలో వేగంగా జరుగుతున్నదని మరికొన్ని పిహెచ్‌సిలలో నామమాత్రంగా జరగడానికి గల కారణాలను తెలపాలని ఆదేశించారు. అలాగే సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. పరికరాల స్టేటస్ నివేదికను ఈనెల 21వ తేదీ లోపు అందజేయాలని, మందులు, డ్రగ్ స్టోర్స్ , మందుల డెలివరీ సైరిక్స్ ఎక్విప్మెంట్ మెయింటెనెన్స్ స్టేటస్ రిపోర్ట్ పంపాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ ప్రభావతి అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బంగారు తిరుత్తని కొండకు నిప్పు


వేసవి రాకనే అగ్నికి ఆహుతి అవుతున్న అటవీ సంపద
అవగాహనతోనే అరికట్టడం సాధ్యం



అగ్నికి ఆహుతి అవుతున్న కొండ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రానికి సమీపంలోని బంగారు తిరుత్తని (నరిపాను) కొండకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో విలువైన అటవీ సంపద అగ్నికి ఆహుతి అవుతోంది. ప్రతి ఏడు వేసవి కాలం సమీపిస్తుంది అంటే మండలంలో ఉన్న అనేక కొండలు గుట్టలు అగ్నికి ఆహుతి అవుతూ విలువైన వృక్ష సంపద బూడిద అవుతోంది. మండలంలో అధిక శాతం వేల ఎకరాలలో అటవీ ప్రాంతాలు ఉన్నాయి. మరీ ఎక్కువగా పెద్ద ఉప్పరపల్లి, పేటూరు, అన్నెమ్మగారిపల్లి, ఆవులపల్లి, నంజంపేట, ఇరికిపెంట, 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీల పరిధిలో ఉన్నాయి. ఏపుగా పెరిగిన చెట్లు ఎన్నో విలువైన వృక్ష సంపద విస్తారంగా విస్తరించిన అడవులు ఎక్కువగా ఉండటం వల్ల ఏనుగుల సంచారం కూడా అధికంగానే ఉంది. వర్షాలు కురిసి అడవులలోని లోతట్టు ప్రాంతాలు కుంటలు నీటితో నిండి వన్యమృగాలకు తాగునీటికి ఎంతో సౌకర్యంగా ఉండేవి. ఈ ఏడాది ఆశించినంత వర్షాలు కురవకపోవడంతో అడవులలోని నీటి కుంటల్లో కూడా నీరు లేక వెలవెలబోతున్నాయని రైతులు అంటున్నారు. ఈ పరిస్థితులలో అడవులకు నిప్పు పెట్టడం వలన అడవులపై ఆధారపడి ఉండే జంతువులు, పక్షులు నీరు లేక ఇబ్బందిపడటమే కాకుండా నీటి కోసం గ్రామాలపైకి వచ్చే ప్రమాదమూ ఉందని ప్రజలు చెబుతున్నారు. అంతేకాకుండా వృక్ష సంపద లేక అంతరించిపోయే అవకాశం ఉంది. అడవికి నిప్పు మానవాళికి ముప్పు అన్న నినాదంతో ప్రజలకు అటవీ సమీపప్రాంత గ్రామాలకు అవగాహన కల్పించాల్సిన అటవీశాఖ అధికారులు ఇంతవరకు ఎలాంటి కరపత్రాలు కానీ సమావేశం నిర్వహించకపోవడంతో రానున్న రోజులలో మరింతగా అడవులకు నిప్పు పెట్టి వృక్ష సంపదను ఆహుతి చేసే అవకాశం ఉంది. అటవీ శాఖ వారు తక్షణ కర్తవ్యంగా మండలంలోని అటవీ సమీప ప్రాంతప్రజలకు గ్రామాల వారికి అడవుల విశిష్టత గురించి నిప్పుపెట్టి వృక్ష సంపద కాలిపోతే మానవాళికి జరిగే ముప్పు గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వన్య సంరక్షణ ప్రేమికులు కోరుతున్నారు.

ఆటపాటలతో చదువు చెప్పాలి : ఎంఈవో



బంగారుపాళ్యంలో ఎంఈవో

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఆటపాటల విద్య ఆకట్టుకునే విద్య అని సర్వశిక్ష అభియాన్ పీవో వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని మొగిలి, మిట్టూరు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం ఎంఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పిఓ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అంగన్వాడీ కేంద్రానికి పిల్లలు ఆకర్షితులయ్యే విధంగా అంగన్వాడీ కేంద్రాన్ని తయారు చేయాలని, పిల్లలకు ఆటపాటలతో విద్య నేర్పించి వారిని ఆకట్టుకునే విధంగా చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు జ్ఞానజ్యోతి కార్యక్రమం సువర్ణ అవకాశమన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ వాణిశ్రీదేవి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పట్టాభి, సూపర్వైజర్లు జయశ్రీ, ఆర్‌పిలు మోహన్ రెడ్డి, రేవతి పాల్గొన్నారు.

కార్వేటినగరం: అంగన్వాడీలోని చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా విద్యాబోధన అందించాలని మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంగన్వాడీకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగుతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంఈవో 2 మనోజ్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల నుంచే చిన్నారులకు అచ్చులు, హల్లు రాసేవిధంగా ఆడుతూపాడుతూ చదువు చెప్పాలన్నారు. రిసోర్సు పర్సన్స్ నరేష్ గురవయ్య, రఘురామ కృష్ణమరాజు పాల్గొన్నారు.

చౌడేపల్లి: మండల కేంద్రమైన చౌడేపల్లిలోని ఉన్నత పాఠశాలలో అంగన్వాడీకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను ఎంఈఓ కేశవరెడ్డి ప్రారంభించారు. ఐసిడిఎస్ ఏసి డిపిఓ అమరజ్యోతి, రిసోర్స్ పర్సన్ రవీంద్ర, వీరకుమార్, మురళి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సులోచన, రమాదేవి పాల్గొన్నారు.

మీ ఇంటి భద్రత మీ చేతుల్లోనే..: ఎస్ఐ

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రతి ఇంటికీ నిఘా నేత్రాలు అమర్చుకోని మీ ఇంటి భద్రతను మీ చేతుల్లో ఉంచుకోవాలని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసే స్టేషన్లో అతి తక్కువ ధరలకు లభించే సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇంటిల్లి పాది విహార యాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు చోరీలు జరగకుండా నియంత్రించడానికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధునాతమైన నిఘానేత్రాలు రూ.2వేలకు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఇంటికీ సీసీ కెమెరాలు అమర్చుకుని చోరీల నియంత్రణకు సహకరించాలన్నారు. అవసరమైన వారు స్టేషన్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గత ప్రభుత్వ వైఫల్యంతో ఉద్యోగులకు నష్టం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గత ప్రభుత్వం ఉద్యోగులను పట్టించుకోకపోవడంతో ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు బెనిఫిట్స్ పొందలేకపోయామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం చిత్తూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేష్ కుమార్‌తో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులను విస్మరించిందన్నారు. గతంలో ఉన్న ఇతర సంఘాలు ప్రభుత్వానికి భజనలు చేస్తూ ఉద్యోగులకు బెనిఫిట్స్ బకాయిలు రాకుండా చేసిందన్నారు. దీనిపై అప్పట్లో పోరాటాలు చేసిన తమపై కేసులు నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన డబ్బులను ఇతర వాటికి వాడుకొని తమకు బకాయిలు పెట్టారన్నారు. తమకు రావాల్సిన నిధులను ఈ ప్రభుత్వం అందించకపోయిన దశలవారీగా బకాయిలను అందించాలని కోరారు. అనంతరం జిల్లా నాయకులతో కార్యాచరణ సమావేశం నిర్వహించారు. అధ్యక్షులు శివయ్య, బాలాజీ, పయని, సురేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి- పలమనేరు : పలమనేరు రూరల్ మండలంలోని కల్లాడం, కొలమాసనపల్లి రైతు సేవా కేంద్రంలో జరిగిన రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని, మండల వ్యవసాయాధికారి సంధ్యతో కలసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఈ విశిష్ట గుర్తింపు కార్డు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంట భీమా, పంటరుణాల పై వడ్డీ రాయితీ పెట్టుబడి సాయం, వ్యవసాయ యంత్ర పరికరాలు, అందుతాయని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి- శాంతిపురం: స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో ఎంపిడివో, మండల ప్రత్యేక అధికారి డీఈఈ పిఆర్.గురవారెడ్డి పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో బుధవారం తాగునీరు, శానిటేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడివో మాట్లాడుతూ మండలంలో 124 పంపులు పనిచేస్తున్నాయని, ఏవైనా మరమ్మతులకు గురైతే వెంటనే రిపేరు చేసి వినియోగంలోకి తెచ్చేలా సామాగ్రి అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోజు బోరు మెకానిక్ అన్ని గ్రామాలలో అవసరమైన చోట రిపేర్లు చేపడుతున్నారని తెలిపారు. గత వారంలో మండలంలో 9 గ్రామాలలో తాగునీరు పథకానికి సంబంధించిన రిపేర్లు చేయడం జరిగిందని, మండలంలో ఏదైనా పంచాయతీలో తాగు నీటి బోర్లు రిపేరు అయితే 24 గంటల్లో రిపేరు చేసి తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూస్తామని అన్నారు. ఇప్పటివరకు ఎక్కడా తాగునీటి సమస్య లేనందున ట్యాంకరు ద్వారా తాగునీటి సరఫరా చేయలేదని, తాగు నీటి బోర్లు చుట్టూ శుభ్రంగా ఉంచాలని ప్రజలందరూ కూడా దీనికి సహకరించి పారిశుధ్యాన్ని మెరుగుపరచటానికి సహకరించాలని కోరారు. గ్రామాలలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు ఉంటే 94910 71394 నెంబరుకు ఫోన్ చేసి తనకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

చెత్త సేకరణ ద్వారానే గ్రామాలు పరిశుభ్రం

ప్రజాశక్తి- సోమల: పంచాయతీ కేంద్రాలు, పంచాయతీ పరిధిలోని గ్రామాలలో చెత్తసేకరణ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని, సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలకు తరలించి వాటి ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని ఎంపీడీవో నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు ఎస్‌డబ్ల్యూపిసి (చెత్త నుంచి సంపద) కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరుచేసి వాటిని బృందావనాలకు తరలించి, వానపాములను తొట్టెల్లో వదిలి ఎరువులు తయారు చేసి వాటిని అమ్మి పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈవో ఆర్డి లక్ష్మీదేవి మాట్లాడుతూ మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మురుగునీటి కాలువలకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమలు క్రిములు అభివృద్ధి చెందకుండా చూడాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి జయశంకర్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

'విద్యార్థులు శ్రద్ధగా చదవాలి'

ప్రజాశక్తి- పుంగనూరు : ప్రభుత్వపాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల్లో ఎక్కువ భాగం పేదలే ఉంటున్నారని, వారి తల్లిదండ్రులకు చదువుల గురించి సరైన అవగాహన లేకపోవడంతో వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంలో విఫలమవుతున్నారని స్థానిక జెడ్‌పి బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులు జి.వెంకట రమణ తెలిపారు. పేదకుటుంబాల్లోని పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారని అన్నారు. గత 16 సంవత్సరాలుగా పాఠశాల పరిధిలోని గ్రామాల్లోని 10వ తరగతి విద్యార్థులకు రాత్రి వేళ్లలో పలు సబ్జెక్టులను చదివిస్తూ వారి అనుమానాలను నివృత్తి చేస్తూ చదువుపై శ్రద్ధపెట్టేలా చేస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే ట్రిబుల్ ఐటీ, కార్పొరేట్ కళాశాలలో ఉచిత సీట్లు పొందవచ్చునని తల్లిదండ్రులకు సూచించారు.